క్లుప్తంగా

అమలాపురం డీఎస్పీ బదిలీ

అమలాపురం టౌన్: అమలాపురం పోలీస్ సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.మహేశ్వరరావు బదిలీ అయ్యారు. ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. మంగళగిరిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశాలు వచ్చాయి. అలాగే అమలాపురం డీఎస్పీగా ఇంకా ఎవరినీ నియమించలేదు. అనకాపల్లి దిశ డీఎస్పీగా పనిచేస్తున్న మహేశ్వరరావును ఎన్నికల బదిలీల్లో భాగంగా అప్పట్లో ఇక్కడ నియమించారు. ఆరు నెలల పాటు ఆయన ఇక్కడ పనిచేశారు.

ఈ నెల 14 నుంచి అష్టలక్ష్మీయాగం

తాళ్లరేవు: పవిత్ర శ్రావణమాసం సందర్భంగా తాళ్లరేవు భూసమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ సుదర్శన లక్ష్మీనరసింహ మహాలక్ష్మీ పారాయణ సహిత అష్టలక్ష్మీ యాగాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు తెలిపారు. సుదర్శన అష్టకం, లక్ష్మీఅష్టోత్తరం, లక్ష్మీనరసింహ కరావలంబ స్తోత్రాలను 11 సార్లు చొప్పున, శ్రీస్తుతి, అష్టలక్ష్మీ స్తోత్ర పారాయణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వచ్చే నెల 1వ తేదీన పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆయా పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని తరించాలని ఆయన కోరారు.

మినీ గోకులం నిర్మాణానికి దరఖాస్తుల ఆహ్వానం

అల్లవరం: మండలవ్యాప్తంగా 50 మినీ గోకులాల నిర్మాణానికి పాడి రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో గురువారం ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ మాట్లాడుతూ గోకులం నిర్మాణానికి ఆసక్తి చూపే పాడి రైతు జాబ్ కార్డు, బ్యాంక్ ఖాతా, పశు వైద్యాధికారి ధ్రువీకరణ పత్రాలను జత చేయవలసి ఉంటుందన్నారు. ఈ నెల 14 నుంచి క్షేత్రస్థాయిలో గోకులం పథకంపై పరిశీలన చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనుబాబు, ఉపాధి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పైడా కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

తాళ్లరేవు: పటవల పైడా ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 10వ తేదీ శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పైడా సత్యశ్రీరామ్ తెలిపారు. పైడా గ్రూపు సంస్థ, వికాస సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జెన్‌ఫాక్ట్ సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహించే ఈ ఇంటర్వ్యూలకు 2021-22 నుంచి 2023-24 మధ్య కాలంలో ఇంజినీరింగ్, ఏదైనా డిగ్రీ, పీజీ కోర్సు పూర్తి చేసి 28 ఏళ్లలోపు వయసున్న అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు వెంట తెచ్చుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 85003 30599, 96660 29205 సెల్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ముమ్మిడివరం: మండల విద్యుత్ ఉప కేంద్రం 33/11 కేవీ కొత్తలంక ఫీడర్ పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అమలాపురం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తలంక ఆర్‌డబ్ల్యూఎస్ ఫీడర్ పరిధిలో ముమ్మిడివరం, పల్లిపాలెం, రాజుపాలెం, నడిమిలంక, కొత్తలంక, చిన కొత్తలంక, మర్లపాలెం, కర్రివానిరేవు, వడ్డి గూడెం, వరగల్లంక, గేదెల్లంక, గాడిలంక, కొమానపల్లి, అన్నంపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు చెప్పారు.

ఉప్పలగుప్తం: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం బ్యాంక్ వీధి, మునిపల్లి, చిన గాడవిల్లి, పెదగాడవిల్లి, సన్నవిల్లి, గొల్లవిల్లి, వానపల్లిపాలెం, ఎస్.కొత్తపల్లి ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఈఈ రవికుమార్ గురువారం తెలిపారు.

చొల్లంగి వద్ద బొలెరో బోల్తా



చొల్లంగి వద్ద బోల్తా పడిన బొలెరో వాహనం

తాళ్లరేవు: చొల్లంగి యూనియన్ బ్యాంకు సమీపంలో జాతీయ రహదారి-216పై గురువారం తెల్లవారుజామున అమలాపురం నుంచి కాకినాడ వెళుతున్న బొలెరో వాహనం ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలూ కాలేదని స్థానికులు చెబుతున్నారు. దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదని ఎస్‌ఐ పి.సత్యనారాయణ తెలిపారు.


ఊపందుకున్న వెంకన్న ఆలయ పనులు

- రూ.5.75 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం
- టీటీడీ సహకారంతో శరవేగంగా పనులు
- నూతన ఆలయం కోసం ఎదురుచూస్తున్న భక్తజనం

యానాం: సుమారు 600 ఏళ్ల క్రితం నాటి రెడ్డిరాజులు నిర్మించిన భూసమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయ పునర్నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.5.75 కోట్లతో నిర్మిస్తున్న ఈ నూతన ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం సహకారమందిస్తోంది. ఇప్పటికే ఆలయ పునాది పనులు పూర్తి కావడంతో తాజాగా రాతి పనులు ప్రారంభించారు. దీనికోసం ప్రత్యేక రాయిని తమిళనాడు ప్రాంతం నుంచి రప్పించి వినియోగిస్తున్నారు. రెండేళ్లలో పనులు పూర్తయ్యి భక్తుల దర్శనానికి అందుబాటులోకి వస్తుందని అధికారులు భావిస్తున్నారు.



సాగుతున్న వెంకన్న ఆలయ నిర్మాణ పనులు



నూతన వెంకన్న ఆలయం నమూనా

మీసాల వెంకన్న సాక్షిగా కల్యాణాలు

కాకతీయుల పతనానంతరం రెడ్డిరాజుల ఆవిర్భావం జరిగిందని చరిత్ర చెబుతుంది. కొండవీటి రెడ్డి రాజులలో ఒకడైన కుమారగిరిరెడ్డి తన బావ కాటయ వేమారెడ్డి శౌర్యసాహసాలకు మెచ్చి రాజమహేంద్రవరం ఇచ్చేశాడు. ఆయన పాలనలోనే 15వ శతాబ్దంలో యానాంలో భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మాణం జరిగినట్లుగా శాసనాల్లో పేర్కొన్నారు. తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి ఆలయం కంటే ముందుగానే ఇక్కడ మీసాల వెంకన్నను ప్రతిష్ఠించినట్లుగా పండితులు చెబుతున్నారు. 1929లో బ్రిటిష్ ప్రభుత్వం బాల్య వివాహాలను నిషేధిస్తూ శారదా చట్టాన్ని తీసుకొచ్చింది. సరిహద్దున ఉన్న ఫ్రెంచి పాలిత యానాంలో ఆ చట్టం అమల్లో లేకపోవడంతో తెలుగు, తమిళ ప్రజలంతా మీసాల వెంకన్న ఆలయానికి వచ్చి బాల్యవివాహాలు జరిపించేవారు. నాటి నుంచి యానాం కల్యాణపురంగా పేరుగాంచింది.

పునర్నిర్మాణానికి ఎన్నో అడ్డంకులు

వందల ఏళ్ల క్రితం నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరుకోవడం, వర్షాలు ఎక్కువగా కురిసినపుడు డ్రెయినేజీలు పొంగి ఆ నీరు స్వామివారి ఆలయంలోకి వెళిపోతుండడంతో మీసాల వెంకన్న ఆలయాన్ని పునర్నిర్మించాలని భావించారు. 2019, ఫిబ్రవరి 21న పురాతన ఆలయాన్ని కూల్చివేసి మూలవిరాట్‌ను పక్కనే నిర్మించిన బాలాలయంలో ప్రతిష్ఠించారు. అయితే నాటి నుంచి వివిధ కారణాలతో ఆలయ పునర్నిర్మాణం జాప్యమవుతూ వచ్చింది. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం రూ.5.45 కోట్లు, పుదుచ్చేరి దేవదాయశాఖ, హెచ్‌ఆర్‌ఏల నుంచి రూ.80 లక్షలు, భక్తుల విరాళాలతో కలిపి మొత్తంగా రూ.10 కోట్లతో నూతన ఆలయాన్ని నిర్మించాలని భావించినా అది సాధ్యం కాలేదు. అప్పట్లో టీటీడీ పాలకవర్గ సభ్యుడిగా ఉన్న మల్లాడి కృష్ణారావు కృషితో రూ.2.75 కోట్ల భక్తులు విరాళాలు టీటీడీకి జమ చేశారు. దీంతో టీటీడీ అదనంగా మరో రూ.3 కోట్లు మంజూరు చేయడానికి ముందుకొచ్చింది. ప్రస్తుతం రూ.5.75 కోట్ల నిధులతో ఆలయ పునర్నిర్మాణ పనులు ఊపందుకున్నాయి.



యానాంలో కొలువైన వేంకటేశ్వరస్వామి (మీసాల వెంకన్న)

త్వరితగతిన పూర్తి చేయాలనుకుంటున్నాం



చారిత్రక మీసాల వెంకన్న ఆలయ నిర్మాణ పనులు వివిధ కారణాల వల్ల ఆలస్యమయ్యాయి. తిరుమల తిరుమతి దేవస్థానం, భక్తుల సహకారంతో ఆలయ పనులు ముందుకు సాగుతున్నాయి. త్వరితగతిన ఆలయ నిర్మాణాన్ని పూర్తిచేసి భక్తుల దర్శనానికి అందుబాటులో తీసుకురావాలని ప్రయత్నాలు చేస్తున్నాం.
– మల్లాడి కృష్ణారావు, టీటీడీ మాజీ సభ్యుడు, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి

తెలుగు భాషా సంబరాల పోస్టర్ల ఆవిష్కరణ



తెలుగు భాషా సంబరాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్: అమలాపురంలో ఈ నెల 18న జరిగే తెలుగు భాషా దినోత్సవ సంబరాలు, జాతీయ శతాధిక కవి సమ్మేళనం పోస్టర్లను కలెక్టర్ రావిలాల మహేష్‌కుమార్ ఆవిష్కరించారు. శ్రీశ్రీ కళా వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం రాత్రి కలెక్టరేట్‌లో జరిగింది. తెలుగు సంబరాలు, శతాధిక కవి సమ్మేళానికి ముఖ్య అతిథిగా రావాలని కలెక్టర్ మహేష్‌కుమార్‌కు శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలార్జున సత్యనారాయణ మాకే, జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, జిల్లా కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ ఆహ్వాన పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్‌కు జ్ఞాపిక అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో కుంపట్ల సుభాషిణి, జల్లి సుజాత, కవులు పాలమూరి వెంకట్, కదలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైశ్య సంఘం అధ్యక్షుడిగా సత్యనారాయణమూర్తి



వాసవీ మాత సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేస్తున్న పట్టణ వైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రతినిధులు

అమలాపురం టౌన్: పట్టణ వాసవీ కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘానికి నూతన అధ్యక్షుడిగా నంబూరి సత్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా నంబూరి నరేష్, కోశాధికారిగా కొమ్మూరి వెంకటాచలప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో నూతన కార్యవర్గ ప్రతినిధులు గురువారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వాసవీ మాత ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నూతన కార్యవర్గ ప్రతినిధులను బులియన్ మార్కెట్ అసోసియేషన్ ప్రతినిధులు మేడిచర్ల త్రిమూర్తులు, బోణం సత్య వరప్రసాద్, మద్దింశెట్టి ప్రసాద్ తదితరులు సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ పట్టణ ఆర్య వైశ్యుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. సంఘం ద్వారా సేవ, ఆధ్యాత్మిక, విజ్ఞాన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పట్టణ వైశ్య ప్రముఖులు వంకాయల కాశీ, యెండూరి నాగేశ్వరరావు, వరదా సూరిబాబు, నందిపాటి శ్రీనివాస్, యర్రమిల్లి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి సూర్యారావు మృతి



సూర్యారావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అమలాపురం రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బీజేపీ ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి కొల్లి సూర్యారావు (53) గురువారం మృతి చెందారు. అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రామానికి చెందిన సూర్యారావు బుధవారం సాయంత్రం అమలాపురం వచ్చారు. పని ముగించుకుని తిరిగి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళుతున్న ఆయనను పాలగుమ్మి అయ్యప్పస్వామి ఆలయం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు హుటాహుటీన అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఆయన మృతి చెందారు. సూర్యారావు సోదరుడు గంగాధరం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తాలూకా ఎస్‌ఐ వై.శేఖర్ బాబు తెలిపారు. సూర్యారావు మృతి సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆయన ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. సూర్యారావు మృతదేహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, మోకా వెంకట సుబ్బారావు, ఆకుమర్తి బేబీరాణి, గునిశెట్టి వెంకటేశ్వరరావు, చీకురుమెల్లి శ్రీనివాస్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ముమ్మిడివరం: ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను పౌరులంతా సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ పిలుపు నిచ్చింది. మండలంలో అన్నంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కోర్టు ఆదేశాల మేరకు గురువారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మణి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాసరి సత్యనారాయణ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వమే ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తుందన్నారు. శిబిరంలో సచివాలయ కార్యదర్శి భవానీ, 104 వాహనం డీఈఓ విజయ్, ఎంఎల్‌హెచ్‌పీ అనిల్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పొన్నాడ



కాట్రేనికోనలో జగడం బాలయ్య సతీమణి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పొన్నాడ

కాట్రేనికోన: సతీవియోగంతో బాధపడుతున్న కాట్రేనికోన పీఏసీఎస్ అధ్యక్షుడు జగడం బాలయ్య, ఆయన కుమారుడు శ్రీనివాస్‌లను, బూలవారి పేటలో పితృ వియోగంతో బాధపడుతున్న వెంకటేశ్వరరావును జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ గురువారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అడవిపేటలో అనారోగ్యంతో బాధపడుతున్న నీలం బాలయ్యను పరామర్శించి ఆయన ఆరోగ్యం గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీపీ పాలెపు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్, మండల పార్టీ కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, సంసాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో మౌలిక సౌకర్యాలు కల్పించండి



పుదుచ్చేరి అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గంలో ఉన్న ఏకైక ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పుదుచ్చేరి శాసనసభ సాక్షిగా ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జరిగిన బడ్జెట్ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ యానాం ప్రభుత్వాసుపత్రిలో ఎక్సరే మెషీన్ సైతం పనిచేయని దుస్థితి నెలకొందన్నారు. ఆసుపత్రిలో పాడైపోయిన ఎక్సరే, స్కానింగ్ మెషీన్లను సమకూర్చాలని, ల్యాబ్‌ను అధునాతనంగా తీర్చిదిద్దాలని అనేకసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా స్పందన లేదన్నారు. సరైన సౌకర్యాలు లేక వైద్య పరీక్షలకు సైతం పక్కనే ఉన్న ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారన్నారు. యానాం ఆసుపత్రిలో వైద్యం అందని కారణంగా ఇటీవల 8 ఏళ్ల బాలుడు మృతి చెందిన ఘటనను సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. ఆదిద్రావిడ సంక్షేమశాఖ ద్వారా 1996లో ఎస్సీలకు నిర్మించిన గృహాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. వాటి స్థానంలో నూతన గృహాలు నిర్మించాలని వేడుకున్నారు.

ఆర్థిక సాయం అందజేత



విద్యార్థిని తండ్రికి చెక్కు అందిస్తున్న ట్రస్ట్ చైర్మన్ సూర్యనారాయణ

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంకకు చెందిన లక్కింశెట్టి వర్షితకు హాస్టల్ ఫీజు నిమిత్తం రూ.25,000 ఆర్థిక సాయం చెక్కును గారపాటి వీర్రాజు ట్రస్ట్ చైర్మన్ గారపాటి సూర్యనారాయణ గురువారం అందజేశారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయనగరం ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రవేశం పొందిన వర్షిత మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి సాధనాల నాగేశ్వరరావు, కోశాధికారి బసవా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోరంగి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ



కోరంగి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

తాళ్లరేవు: పోలీస్‌స్టేషన్‌కు వచ్చేవారితో మర్యాదపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలని కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. గురువారం ఆయన కోరంగి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లో వివిధ రికార్డులను పరిశీలించారు. ప్రతి విషయాన్ని రికార్డుల్లో నమోదు చేయాలని, సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట కాకినాడ రూరల్ సీఐ చైతన్య కృష్ణ, ఎస్‌ఐ పి.సత్యనారాయణ ఉన్నారు.

బిస్కెట్లు, పండ్లు అందజేత

అమలాపురం టౌన్: స్థానిక హరి మనో వికాస కేంద్రంలోని మానసిక దివ్యాంగులతో కోర్టుల ప్యానల్ లాయర్లు గురువారం మమేకమై వారితో కొంతసేపు గడిపారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు బిస్కెట్లు, పండ్లు అందజేశారు. అనంతరం మానసిక దివ్యాంగుల హక్కులపై కేంద్రం నిర్వాహకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్లు భాస్కరశాస్త్రి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బోటు ఇంజిన్ల నిర్వహణపై సదస్సు



సదస్సులో బుక్‌లెట్ అందజేస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: సముద్రంలో వేట సమయంలో చేపలబోట్లలో వచ్చే లోపాలు, మరమ్మతుల నిర్వహణపై స్థానిక ఎస్ఎస్ఏ సమావేశ హాలులో గురువారం అవగాహ సదస్సు నిర్వహించారు. సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్, నాటికల్ అండ్ ఇంజినీరింగ్ శాఖ, మత్స్యశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు ఆర్ఏఓ మునిస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పీఎంఎంఎస్‌వై పథకం కింద ఎస్ఎస్‌డీబీ నిధులతో మత్స్యకారుల ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫిషరీస్ ఏడీ గొంతియ్య, వీఎల్ పుజార్, హరినాథ్, అర్జున్, ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు పాల్గొన్నారు.

గంజాయి కేసులో మరో వ్యక్తి అరెస్ట్

మలికిపురం: గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న సఖినేటిపల్లి మండలం అప్పనరామునిలంక గ్రామానికి చెందిన ముద్దాయి మిరియాల బన్నును అరెస్టు చేసి కోర్టుకు పంపినట్లు ఎస్సై పీవీఎస్ఎస్ సురేష్ తెలిపారు. ఇకమీదట ఎవరైనా గంజాయి తాగినా.. లేక అమ్మినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. అలాగే మండలంలోని ఇరుసుమండ శివారులో జరుగుతున్న కోడిపందాలపై దాడి చేసినట్లు ఎస్సై తెలిలపారు. పందాలు ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కోడిపుంజులు, రెండు కత్తులు, రూ.2200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

మామిడికుదురు: ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాల ప్రభావం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి స్వర్ణలత సూచించారు. మామిడికుదురులోని కొర్లగుంట రోడ్డులో హైదరాబాద్ నుంచి వచ్చిన సీహెచ్ భరత్‌కు డెంగీ జ్వరం నిర్ధారణ కావడంతో గురువారం ఆ పరిసర ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టారు. ఈ సర్వేను డాక్టర్ స్వర్ణలత పరిశీలించారు. ఫీవర్ సర్వేలో జ్వర పీడిత కేసులు ఏమీ నమోదు కాలేదని ఆమె తెలిపారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కాచిన నీటినే తాగాలని సూచించారు. ఆమె వెంట సీహెచ్ఓ సత్యవతి, పీహెచ్ఎన్ జె.నారాయణమ్మ, సూపర్ వైజర్ బీవీవీ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాస్, ఏఎన్ఎంలు కె.దుర్గాదేవి, ఎం.జయకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ రోషిణి, శిరీష, ఆశ కార్యకర్తలు లక్ష్మీకుమారి, మాధురి, ప్రభావతి, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు



అమలాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎస్ఎంసీ ఎన్నిక



పటవల హైస్కూల్ వద్ద ఎస్ఎంసీ ఎన్నికల సందడి



గోడితిప్ప యూపీ స్కూల్లో ఎన్నికైన పేరెంట్స్ కమిటీ నూతన కార్యవర్గం

అమలాపురం టౌన్: పట్టణంలోని పలు ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. స్థానిక వెత్సావారి అగ్రహారంలోని మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల, స్థానిక రవణం వీధిలోని సుభాష్ చంద్రబోస్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు ఎంపికైన నూతన కమిటీని పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని తదితరులు అభినందించారు.

ముమ్మిడివరం: మండలంలోని 66 ప్రాథమిక పాఠశాలలు, మూడు ప్రాథమికోన్నత పాఠశాలలు, 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు మొత్తం 79 పాఠశాలలకు ఎస్ఎంసీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయని మండల విద్యాశాఖాధికారి బి.రమణశ్రీ తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీల సభ్యులకు అభినందనలు తెలిపారు.

మూడు పాఠశాలల్లో నిలిచిన ఎన్నిక

తాళ్లరేవు: మండలంలోని 79 పాఠశాలలకు గాను 76 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు గురువారం పూర్తయ్యాయి. మండల విద్యాశాఖాధికారులు ఎ.మంగాయమ్మ, మోకా ఉమ పర్యవేక్షణలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంల నేతృత్వంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గాడిమొగ పంచాయతీ పెదవలసల ప్రాథమిక పాఠశాలలో సభ్యుల ఎన్నిక పూర్తయినా చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక విషయంలో వివాదం చెలరేగింది. ఇరువర్గాలు బాహాబాహీకి దిగడంతో ఎన్నికను వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. లచ్చిపాలెం, హోప్‌ఐలాండ్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడంతో ఎన్నికలు నిర్వహించలేదు.

అల్లవరం: మండలంలోని 79 పాఠశాలలకు గాను 64 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని, 15 పాఠశాలల్లో మాత్రమే పోటీ జరిగిందని ఎంఈఓ కిరణ్‌బాబు గురువారం తెలిపారు. దేవగుప్తం హైస్కూల్‌లో పేరెంట్స్ కమిటీ ఎన్నిక రసాభాసగా మారింది. ప్రతి తరగతి నుంచి ముగ్గురు సభ్యులను ఎన్నుకునే సమయంలో టీడీపీ చెందిన పచ్చిమల రమేష్ అనే యువకుడు తానే ఎన్నికల అధికారిగా వ్యవహరించి సభ్యులను ఎంపిక చేసే ప్రయత్నం చేశాడు. దీంతో తల్లిదండ్రులు మీకు ఏ అధికారం ఉందని ఎన్నిక నిర్వహిస్తున్నారని ఎదురు తిరిగారు. గ్రామ పెద్దలు కలగజేసుకుని పాఠశాల హెచ్ఎం వేణుగోపాల్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు.

ఐ.పోలవరం: మండలంలో 66 ప్రాథమిక, 2 ప్రాథమికోన్నత, 11 ఉన్నత పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహించినట్టు ఎంఈవో-2 కొయ్యాని తిరుమలరావు తెలిపారు. ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో వ్యవహరించి ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించారన్నారు.

అమలాపురం రూరల్: మండలంలోని 106 పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్లు ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాష్ తెలిపారు.

ఉప్పలగుప్తం: మండలంలోని 82 పాఠశాలల్లో గురువారం పేరెంట్స్ కమిటీ ఎన్నికలు జరిగాయి. అయితే పలు పాఠశాలల్లో కూటమి నాయకులు ఏకపక్షంగా వ్యవహరించి పేరెంట్స్ కమిటీ ఎన్నికలను నిర్వహించారన్న విమర్శలు సర్వత్రా వినిపించాయి.